సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆహారం పొట్లాల పంపిణీ



రైల్వే స్టేషన్ వద్ద పేదలకు ఆహారం పొట్లాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: గీతా చానల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద పేదలకు ఆహార పొట్లాలు అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విజయ్ కుమార్ శర్మ ప్రత్యేకంగా తయారు చేయించిన ఆహార పొట్లాలను యాచకులతో పాటు పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోన వెంకటరావు, ఎం గోపాల్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వేగం వద్దు.. నిదానమే ముద్దు




నిదానంగా వెళ్లాలంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న కాకి సంతోష్

మల్కాపురం: అతివేగం ప్రమాదకరమని.. పరిమిత వేగంతో ప్రయాణించడం ఎంతో మేలని ఓ యువకుడు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నాడు. మల్కాపురానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కాకి సంతోష్ ఆదివారం మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో నిదానంగా వాహనాలను నడపాలంటూ ప్లకార్డు పట్టుకుని ప్రచారం చేశాడు. అతివేగంగా వెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని, తోటి ప్రయాణికులను ఇబ్బంది పెట్టొద్దని హితవు పలికాడు. తమను నమ్ముకుని ఉన్న కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని నిదానంగా ప్రయాణం సాగించాలని సూచించాడు.

పెయింటింగ్ పోటీలు నేడు

సింథియా: విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడానికి నేతాజీ సుభాష్‌చంద్ర బోస్ జయంతి పురస్కరించుకుని దేశవ్యాప్తంగా పరాక్రమ్ దివస్ పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా సోమవారం మల్కాపురంలోని నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పెయింటింగ్ పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యులు



ప్రసంగిస్తున్న ప్రధానార్చకుడు శేషాచార్యులు

సీతంపేట: ప్రపంచ సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యుల జీవితమే ఒక గొప్ప సందేశమని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు గోపినంబాళ్ల శేషాచార్యులు పేర్కొన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శ్రీమద్రామానుజాచార్యుల విశిష్టతపై ఆయన ప్రసంగించారు. 1017–1137 మధ్య కాలంలో జీవించిన శ్రీమద్రామాజానుచార్యులు విశిష్ట ద్వైతాన్ని ప్రతిపాదించిన గొప్ప తత్వవేత్త, హేతువాది, యోగి అని కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ సర్వమత సారం ఒక్కటేనని బోధించి, దాన్ని ఆచరించి ప్రజలకు వివరించిన సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యులు నేటి తరానికి ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త రాంభట్ల నృశింహశర్మ, దయాల్ సుబ్రహ్మణ్యం, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష

- వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో 29 సెంటర్లు
- స్వయంగా పర్యవేక్షించిన ఏసీపీ నర్సింహమూర్తి



మల్కాపురం పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులకు సూచనలిస్తున్న సీఐ లూథర్‌బాబు



గాయత్రీ కళాశాల కేంద్రంలో పరిశీలిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

గోపాలపట్నం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ కానిస్టేబుల్ అర్హత పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు తరలివచ్చారు. హాలు టికెట్, ఆధార్ కార్డు వంటివి పరిశీలించి అధికారులు పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్న పాఠశాల కేంద్రానికి ఉదయం 8 గంటలకే అభ్యర్థులు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేశారు. కేంద్రాల సమీపంలో ఎవరూ గుమి గూడకుండా పోలీసులు పహారా కాశారు. కేంద్రాల్లోకి స్మార్ట్ ఫోన్, బ్లూటూత్ బ్యాగులు వంటివాటికి లోపలికి అనుమతించలేదు.

అభ్యర్థుల హాజరు ఇలా..

- కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 పరీక్షా కేంద్రాల్లో 2252 మంది అభ్యర్థులకు 2053 మంది హాజరయ్యారు. 199 మంది గైర్హాజరయ్యారు.
- ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని 10 పరీక్షా కేంద్రాల్లో 4048 మంది అభ్యర్థులకు 3696 మంది హాజరయ్యారు. 352 మంది గైర్హాజరయ్యారు.
- గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని 4 పరీక్షా కేంద్రాల్లో 1650 మందికి గాను 1513 మంది హాజరయ్యారు. 237మంది హాజరు కాలేదు.
- పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 10 పరీక్షా కేంద్రాల్లో 5474 మందికి గాను 4984 మంది హాజరయ్యారు. 490 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 13424 మంది దరఖాస్తు చేసుకోగా 12246 మంది హాజరయ్యారు. మొత్తం 1178మంది పరీక్షలకు హాజరు కాలేదు.

అభ్యర్థులకు సీఐ సూచనలు

మల్కాపురం: రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్ల నియామకాలకు ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల కేంద్రంలో వెయ్యి మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 694 మంది పురుషులు, 220 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. సెయింట్ జోసఫ్ పాఠశాల కేంద్రంలో జరిగిన పరీక్షలో 557 మంది పరీక్ష రాశారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. పరీక్ష సెంటర్ల వద్ద పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు. సెంటర్ వద్దకు వచ్చిన సీఐ లూథర్‌బాబు అభ్యర్థులకు ధైర్యం చెప్పి ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. నియమ నిబంధనలు తప్పక పాటించాలని, ఎటువంటి మాపింగ్‌కు పాల్పడవద్దన్నారు.



గోపాలపట్నం బాలాజీ పాఠశాల వద్ద అభ్యర్థులను లోపలికి పంపిస్తున్న పోలీసులు



గోపాలపట్నం జిల్లా పరిషత్ స్కూల్ వద్ద ఉదయం 8.30 గంటలకే హాజరైన అభ్యర్థులు

ఘనంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎల్ నరసింహారావు, సోము వీర్రాజు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు వద్ద ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ అన్న ప్రధాని నరేంద్రమోదీ నినాదంలో భాగంగా ఒకరినొకరు గౌరవించుకోవాలన్నది లక్ష్యమన్నారు. ఆంధ్రలో నివాసం ఉంటున్న ఇతర రాష్ట్రాల ప్రజలు భిన్నత్వంలో ఏకత్వం పాటిస్తున్నారన్నారు. ఢిల్లీ ఎంపీ మనోజ్ తివారీ మాట్లాడుతూ విశాఖ వాసుల అభిమానం కొలవలేనిదన్నారు. కార్యక్రమంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఆంధ్ర కన్వీనర్ సహాసిని ఆనంద్, ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్ర, పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి దాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పరస



విశేష అలంకరణలో మరిడిమాంబ



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం వాసుల గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి(కాకి అప్పన్న) పరస ఆదివారం వైభవంగా నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ఆలయం వద్ద బారులు తీరి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ పరిసరాల్లో పరస నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, గీతాలాపన, బుర్రకథ, సినీ రికార్డింగ్ డాన్స్ ప్రోగ్రాంలు అలరించాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ సిహెచ్.వంశీకృష్ణ యాదవ్‌లు మరిడిమాంబను దర్శించుకుని పూజలు చేశారు. పరస వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మల్కాపురం పోలీసులు చర్యలు చేపట్టారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిలక రామ్మోహన్‌రెడ్డి(రాము), నూకరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై పోస్టర్ల తొలగింపు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అతికించిన పోస్టర్లను జేడీ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. పిల్లర్లపై పలు సంస్థలు, రాజకీయ పార్టీలు ఇష్టానుసారంగా అతికించిన పోస్టర్లను గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు ప్రత్యేక సాధనాలతో తొలగించారు. ఈ సందర్భంగా సభ్యుడు కృష్ణయ్య మాట్లాడుతూ నగరంలో ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రత్యేకమైందని దీన్ని కాపాడుకుందామని కోరారు. ఈ బ్రిడ్జ్ ఫిల్లర్లపై, గోడలపై సాంప్రదాయ బొమ్మలు వేసి సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. ఇకపై పోస్టర్లు అతికించకుండా నిషేధం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఫ్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్లపై పోస్టర్లు తొలగిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

బోరు పరిసరాలు అధ్వానం



గౌరీనగర్-సుభాష్‌నగర్ ప్రాంతంలో అధ్వానంగా బోరు వద్ద పరిసరాలు



అశోక్‌నగర్‌లో బోరుకు అడ్డంగా ఉన్న పైపులు

నీరు పట్టేందుకు స్థానికుల ఇబ్బందులు

కంచరపాలెం: జీవీఎంసీ 55, 56, 57 కంచరపాలెం, ఊర్వశి కూడలి ప్రాంతాల్లోని తాగునీటి బోరు పరిసరాలు అధ్వానంగా ఉన్నా.. పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఊర్వశి కూడలి గౌరీనగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో బోరు చేతి పిడి వద్ద బీటీ రోడ్డు వేయడంతో నీరు పట్టేందుకు ఇబ్బందిగా మారుతోంది. బోరు పరిసరాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం, బోరును ఆనుకుని నిత్యం చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వెలువడుతోంది. బోరు నీరు పట్టుకునేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కంచరపాలెంలోని జాషువానగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో బోర్లను ఆనుకుని నిరంతర తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన మిగులు పైపులను అక్కడే నిర్లక్ష్యంగా వదిలేశారు. పైపులు బోరుకు ఆనుకుని ఉండటంతో నీరు పట్టేందుకు అవస్థ పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

శ్యామానవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దేవీపురంలో గోపూజతో శ్యామా నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న రాజశ్యామలాదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో శ్యామన వరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో తొలుత గోపూజ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీమేరు ఎదురుగా ఉన్న హోమశాలలో సాయంత్రం శ్రీగణపతి సహిత రాజశ్యామలా హోమం నిర్వహించారు.గోపూజ అనంతరం గణపతి,శ్యామాదేవి,అంగ,ఉపాంగ,ప్రత్యాంగ దేవతలకు కలశస్థాపన చేశారు.ఉత్సవమూర్తి రాజశ్యామల దేవికి భక్తులచే క్షీరాభిషేకం, షోడషోపచార పూజ,అష్టోత్తర పూజలు నిర్వహించారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతులమీదుగా భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు శ్రీవిద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని గురుమాత తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ వాడితే చర్యలు



ఎన్‌ఏడీ జంక్షన్‌లో మాంసం దుకాణం వద్ద సంచులను పరిశీలిస్తున్న ఎస్ఎస్ రమణ

గోపాలపట్నం: నిషేధిత ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వంటివి వాడితే కఠిన చర్యలు తప్పవని శానిటరీ సూపర్‌వైజర్ కేవీ రమణ హెచ్చరించారు. జీవీఎంసీ 90వ వార్డులో పలు దుకాణాల్లో ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే యూజర్ చార్జీలు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

పేరుకుపోయిన చెత్తతో ఇబ్బందులు



గోకుల్‌నగర్ రైల్వే ట్రాక్ రోడ్డులో చెత్త కుప్ప

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దుర్గానగర్ గోకుల్‌నగర్ రైల్వే ట్రాక్ రహదారి ప్రాంత పరిసరాలు పేరుకుపోయిన చెత్తతో అధ్వానంగా మారాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఆనుకుని వ్యర్థాలు పారవేయడంతో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు వీధుల్లో తొలగించిన చెత్తను ట్రాక్ రహదారుల్లో వేయడంతో పశువుల సంచారం ఎక్కువైంది. సంబంధిత అధికారులు స్పందించి చెత్త పేరుకుపోకుండా తగు చర్యలు చేపట్టాలి.

– మొల్లి మురళీకృష్ణ, గోకుల్‌నగర్

ఇస్కాన్‌లో పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశేషంగా గరుడ సేవ

వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంచేయజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

మంత్రి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షల వెల్లువ



మంత్రి అమర్‌నాథ్‌కు కేక్ తినిపిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పలు వార్డుల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మిందిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి కేక్ కట్ చేయించి సత్కరించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గజమాలతో సన్మానించారు. జియ్యాని విజయ్, వెదుళ్ల శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

- జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మంత్రి అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గేదెల మురళీ కృష్ణ, గింతెన నాగరాజు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శశాంక్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్, అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అపోలో ఆస్పత్రి హృద్రోగ వైద్య నిపుణుడు డాక్టర్ శశాంక్ చుండూరి, జనరల్ మెడిసిన్ డాక్టర్ వి.ప్రణీత 110 మంది స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్ వైద్య పరీక్షలతోపాటు ఈసీజీ నిర్వహించి రిపోర్టులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ రోజూ వ్యాయామం చేయడం, నడవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. బీపీ, సుగర్ ఉన్న వారు తప్పనిసరిగా ఆహార నియమాలు పాటించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ సలహాలు లేకుండా మందులు వాడరాదని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్, డాక్టర్ ప్రణీతలను వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్, పూర్వాధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామ్, బి.సూర్యనారాయణ మాస్టారు, అపోలో ఆస్పత్రి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గొంపరాంబాబు వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.

డాబాపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతుడి బంధువులతో మాట్లాడుతున్న సీఐ లూథర్‌బాబు

మల్కాపురం: మద్యం తాగి ఉన్న ఓ వ్యక్తి రెండంతస్తుల డాబా పైనుంచి జారి పడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. 58వ వార్డు శ్రీహరిపురం పాత రామాలయం వీధిలో తిట్టి శ్రీను(35) అనే వ్యక్తి తన భార్య, పిల్లలతో కలిసి కొన్నేళ్లుగా నివాసముంటున్నాడు. ఓ ప్రైవేట్ సంస్థలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి ఉన్న శ్రీను తను ఉంటున్న రెండు అంతస్తుల డాబాపై నుంచి కిందకు తొంగి చూసేసరికి అదుపు తప్పి పడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించడంతో జరిగిన సంఘటనపై మృతుడి భార్య మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి సీఐ లూథర్‌బాబు, సిబ్బంది వెళ్లి విచారించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మహాగర్జన'ను జయప్రదం చేద్దాం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యాంజనేయ తదితరులు

సింథియా: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు ఈ నెల 30న తలపెట్టిన మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. ఈమేరకు కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాంద్రేగుల సత్యాంజనేయ, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుడాల రాంబాబు ఆవిష్కరించి కార్యకర్తలకు అందజేశారు. ఉక్కు మహాగర్జన నేపథ్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో రెవెన్యూ డివిజినల్ ఆఫీస్‌ల వద్ద, 25న కలెక్టరేట్ వద్ద నిరసనలు చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఏఐటీయూసీ కార్యదర్శి భోగవిల్లి హరినాథ్, సీపీఐ నాయకులు డి.గోపాలరావు, టి.కామేశ్వరరావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
✆ 9398184202, 9912440606

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
✆ 9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com